నేటి నుంచి గ్రూప్‌-3 పరీక్షలు

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి సోమవారం వరకు మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్‌-3 పరీక్షలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లాలో మొత్తంగా 115 పరీక్షా కేంద్రాలలో 65,361 మంది అభ్యర్థుల హాజరు కానుండటంతో అందుకు అనుగుణంగా పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించినట్లు జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ తెలిపారు. గ్రూప్‌-3 పరీక్షలు రెండు సెషన్లుగా జరుగనున్నాయి. పేపర్‌-1, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, పేపర్‌-2, మధాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 18న పేపర్‌-3 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు నిర్వహిస్తారని కలెక్టర్‌ పేర్కొన్నారు. ముందస్తు సెషన్‌కు సంబంధించి అభ్యర్థులు ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి మధ్యాహ్నం 1:30 గంటల నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తారన్నారు. పరీక్షా కేంద్రం ప్రధాన గేట్‌ను ముందస్తు సెషన్‌కు ఉదయం 9:30 గంటలకు, మధ్యాహ్నం సెషన్‌కు సంబంధించి మధ్యాహ్నం 2:30 గంటలకు మూసివేస్తారన్నారు. గేట్లు మూసివేసిన తర్వాత అభ్యర్థులెవ్వరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరని తెలిపారు. పరీక్షలకు సంబంధించి మొదటి సెషన్‌కు ఉపయోగించిన హాల్‌ టికెట్‌ కాపీని మిగిలిన సెషన్‌లకు ఉపయోగించాలని కలెక్టర్‌ సూచించారు. తుది ఎంపిక ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌ టికెట్లు, అన్నీ సెషన్ల ప్రశ్నా పత్రాలను భద్రపరచుకోవాలని సూచించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు ఉన్నట్లయితే అభ్యర్థులు టీజీపీఎస్సీ టెక్నికల్‌ హెల్ప్‌ డెస్క్‌ ఫోన్‌ నెంబర్లు 040-23542185 లేదా 040-23542187లో సంప్రదించవచ్చన్నారు. హెల్ప్‌ డెస్క్‌ను పని దినాలలో ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం1:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌ తెలిపారు.

సీసీ రోడ్ల కోసం జెడ్సీకి వినతి



మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్‌ సబిహా బేగం కోరారు. ఈ మేరకు శనివారం జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అల్లాపూర్‌ నాలా ఫార్మసీ లైన్‌లో, చిల్ల ఎదురు లైన్‌లో ఉన్న రోడ్డు, సఫ్దార్‌నగర్‌లో ఈ బ్లాక్‌ మెయిన్‌ రోడ్డు, రాజీవ్‌ గాంధీ, సఫ్దార్‌నగర్‌ నాలా ఎదురుగా ఉన్న లైన్‌లో, ఆర్‌కే సొసైటీ, కన్యకా పరమేశ్వరి దేవాలయం రోడ్లు దెబ్బతినడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన సీసీ రోడ్ల కోసం తగిన నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ వివేకానందనగర్‌కు చెందిన కీల వెంకట్రావు, శ్రీలత దంపతుల కుమార్తె తేజమైనాయుడు కూచిపూడి నృత్యంలో ఆకట్టుకుంది. చిన్నతనం నుంచే ఆమెకున్న ఆసక్తిని గమనించి ప్రముఖ నృత్య కళాకారులు కృష్ణమూర్తి వద్ద శిక్షణ ఇప్పించారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం త్యాగరాయ గాన సభలో మొదటిసారి తేజమైనాయుడు తన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకుంది.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

మూసాపేట: కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌ 11కేవీ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్‌ ఏఈ భీమలింగ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఫీడర్‌ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అంబేడ్కర్‌నగర్‌, కోర్టు సమీప ప్రాంతాలు, హైటెక్‌ సిటీ రైల్వే స్టేషన్‌ ప్రాంతాల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా ఆకాశ దీపారాధన



శివపార్వతుల పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్‌: కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రాత్రి మూసాపేట డివిజన్‌ పాండురంగ నగర్‌లోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆకాశ దీపారాధనను ఘనంగా నిర్వహించారు. శివపార్వతుల పల్లకీ సేవ ప్రధాన వీధుల గుండా నిర్వహించి ఆలయ ఆవరణలో ఆకాశ దీపారాధన నిర్వహించారని జీఏకే కృష్ణ తెలిపారు.

విద్యార్థి నాయకుల అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: బాసర ట్రిపుల్‌ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి ఆత్మహత్య ఘటనపై ముట్టడికి ఏబీవీపీ పిలుపునివ్వడంతో స్థానిక విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆయుష్‌, ఆకాష్‌, శంకర్‌, జస్వంత్‌లను కేపీహెచ్‌బీ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని నాయకులు అన్నారు.

భారత వికాస్‌ పరిషత్‌ - నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌ శాఖ, ట్రస్మా కూకట్‌పల్లి సంయుక్త ఆధ్వర్యంలో గురువందన్‌ -ఛాత్రాభినందన్‌ కార్యక్రమాన్ని పీఎస్‌ఎం స్కూల్‌లోని ఇందిరా చంద్రశేఖర్‌ హాల్‌లో శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ఎంఈఓ వి. కిషన్‌ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 81 పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్‌ గురువులను, ఉత్తమ విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమానికి భారత వికాస్‌ పరిషత్‌ నుంచి జలవేందర్‌రావు, రాజేశ్వరరావు, కొండల్‌రావు, సీహెచ్‌. అనిల్‌ కుమార్‌, పంచశీల శ్రీనివాస్‌, సుకృత్‌కుమార్‌, బీఎస్‌ఎన్‌ మూర్తి, సుబ్రహ్మణ్యం, సుబ్బారెడ్డి, నాగరాజు, ట్రస్మా కూకట్‌పల్లి నుంచి పీఎస్‌టీలు కమలాకర్‌, రవిబాబు, సుబ్రహ్మణ్యం, రామకృష్ణారావు, జమీల్‌ పాల్గొన్నారు. - కూకట్‌పల్లి





ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు సర్కారు అనేక చర్యలు చేపడుతోంది. బడుల్లో విద్యార్థులకు మధ్యాహ్నం భోజనాన్ని వడ్డించి, ఏక రూప దుస్తులను అందజేస్తున్న సర్కారు ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టింది. బడులను బాగుచేయాలన్న లక్ష్యంలో భాగంగా మన ఊరు-మన బస్తీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల కింద మౌలిక వసతులను కల్పించింది. ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించి నెలకు రూ.39 లక్షలు అందజేస్తోంది. అలాగే, బడులకు ఉచిత కరెంట్‌ సరఫరా చేస్తోంది. దీంతో మేడ్చల్‌ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రత, పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

- సాక్షి,సిటీబ్యూరో

ప్రభుత్వ బడులకు మహర్దశ..

- బడుల్లో అదనపు గదులు, మౌలిక వసతుల కల్పన
- అమ్మ ఆదర్శ కమిటీల అధ్వర్యంలో 286 బడుల్లో అత్యవసర పనులు
- పారిశుద్ధ్య నిర్వహణకు నిధులతో సహా విద్యుత్‌ బిల్లులు

కార్పొరేట్‌కు దీటుగా..

మన ఊరు-మనబస్తీ-మన బడి కింద సర్కారు బడులను కార్పొరేటుకు దీటుగా తీర్చిదిద్దారు. మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం ఉన్నచోట భవనాలు, అదనపు గదులు, డైనింగ్‌ హాళ్లు, మూత్రశాలలు, ప్రహరీల నిర్మాణాలు, విద్యుత్‌ సౌకర్యం, తాగునీటి వసతి, రంగులు వేయడం, గ్రీన్‌ బోర్డులు, మరమ్మతులన్నీ పూర్తి చేశారు. 182 ప్రభుత్వ పాఠశాలల్లో 12 రకాల సమస్యల్ని గుర్తించిన యంత్రాంగం 150 బడుల్లో రూ. 65 కోట్ల నిధుల కేటాయింపుతో అభివృద్ధి పనులకు జిల్లా విద్యాశాఖ చేపట్టింది. మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, వంట గదులు, భోజనశాలలు వంటి నిర్మాణాలను ఉపాధి హామీ పథకంలో చేర్చగా, భవనం మరమ్మతులు వంటి వాటి కోసం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నియోజకవర్గం, జిల్లా అభివృద్ధి నిధులను వినియోగించేలా చర్యలు తీసుకున్నారు. నీటి వసతి తదితర మౌలిక వసతులు, స్థానిక అవసరాల కోసం కూడా నిధులు కేటాయించారు. ఇందులో పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థల ప్రతినిధులను భాగస్వామ్యం చేసింది.

రూ. 12 కోట్లతో అత్యవసర పనులు

జిల్లాలో 286 ప్రభుత్వ బడుల్లోనే 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీల పర్యవేక్షణలో 699 అత్యవసర పనులను రూ.12 కోట్లతో చేపట్టారు. మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా పది రకాల అత్యవసర పనులను పంచాయతీరాజ్‌, విద్యుత్‌, ఆర్‌అండ్‌బీ, ఈడబ్ల్యూఐడీసీ, టీఎస్‌ఈడబ్ల్యూ, ఓడీసీ విభాగాల ఇంజినీరింగ్‌ శాఖలు పూర్తి చేశాయి. జిల్లాలో 15 మండలాల పరిధిలోని 286 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు గుర్తించిన 699 అత్యవసర పనులకు ప్రభుత్వం ఖర్చు చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో ప్రభుత్వ పాఠశాలలో అత్యవసర పనులైన విద్యుత్‌, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, ఇతరత్రా మేజరు, మైనర్‌ మరమ్మత్తులు చేపట్టారు.

పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధులు

ప్రభుత్వ బడుల్లో పారిశుద్ధ్య నిర్వహణకు సర్కారు ప్రత్యేక నిధులు అందజేస్తోంది. దీంతో గ్రామ పంచాయతీ, పురపాలక పారిశుద్ధ్య సిబ్బందికి ఉపశమనం లభించింది. ప్రత్యేక నిధులను నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల ఖాతాలో జమ అవుతున్నాయి. 3 నెలల నిధులను ముందే వారి ఖాతాలలో జమ చేసేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. మేడ్చల్‌ జిల్లాలో మొత్తంగా 507 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఇందులో 96,284 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో పాఠశాల పరిసరాలను అందంగా ఉంచటంతోపాటు మరుగుదొడ్లను శుభ్రపరచటం, మొక్కలకు నీళ్లు పెట్టడం తదితర పనుల్ని నిర్వహిస్తున్నారు. పాఠశాలల్లో శుభ్రత కోసం అవసరమైన వస్తువులకు కూడా సమగ్ర శిక్ష నిధులను వెచ్చిస్తున్నారు.

మనఊరు- మన బడి కింద 150 పాఠశాలల్లో పూర్తయిన పనులు

బడులకు ఉచిత వెలుగులు

ప్రభుత్వ విద్యాసంస్థలకు ఉచితంగా విద్యుత్‌ సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రాథమిక తరగతుల నుంచి డిగ్రీ, సాంకేతిక కళాశాలలకు ప్రయోజనం చేకూరుతోంది. దీని కోసం విద్యుత్‌ పంపిణీ సంస్థ ప్రత్యేక పోర్టల్‌ ఏర్పాటు చేసింది. విద్యా సంస్థలు ఏ శాఖ పరిధిలోకి వస్తే ఆ శాఖ ఉన్నతాధికారికి పోర్టల్‌ లాగిన్‌ సదుపాయం కల్పించారు. శాఖ పరిధిలోని విద్యా సంస్థల వివరాలను వెబ్‌ పోర్టల్‌లో చేర్చడం, తొలగించడం, సవరణకు అవకాశం కల్పించారు. ఉచిత విద్యుత్‌ నేపథ్యంలో వచ్చిన విద్యుత్‌ బిల్లును విద్యా సంస్థలు చెల్లించకుండా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఆ శాఖకు ప్రతి నెలా డిస్కమ్‌లకు చెల్లిస్తున్నారు. ఇందుకు వీలుగా పోర్టల్‌ను రాష్ట్ర ఆర్థిక శాఖతో అనుసంధానించారు. ఈ లెక్కన ప్రభుత్వ విద్యా సంస్థలకు రూ. లక్షల్లో ఆర్థిక భారం తప్పింది. మేడ్చల్‌ జిల్లాలో 507 ప్రభుత్వ పాఠశాలలు, 3 డిగ్రీ, 5 జూనియర్‌ కళాశాలలు, ఒక ఒకేషనల్‌ కళాశాల, స్పోర్ట్స్‌ అథారిటీ కళాశాల, 6 సాంఘీక సంక్షేమ కళాశాలలు, 2 గిరిజన సంక్షేమ కళాశాలలు, 6 మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ కళాశాలలు, 8 మైనార్టీ సంక్షేమ కళాశాలలకు ఉచిత విద్యుత్‌ వసతి లభిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో మంచి ఆదరణ



కరోనా కష్టకాలం నుంచి ప్రభుత్వ బడులకు ఆదరణ పెరిగింది. సర్కారు విద్య బలోపేతానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఆంగ్ల విద్య ప్రవేశంతోపాటు మధ్యాహ్న భోజనం, ఏక రూపు దుస్తుల పంపిణీ, మన బడి-మనబస్తీ-మన ఊరు, అమ్మ ఆదర్శ కమిటీలతో బడుల్లో మౌలిక వసతులు కల్పన వంటి పనులు సర్కారు పాఠశాలలకు ఆదరణ పెంచింది. సీఎస్‌ఆర్‌ నిధులతో బడుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. పారిశుద్ధ్య నిర్వహణ, ఉచిత కరెంట్‌ సరఫరా వంటి కార్యక్రమాలు ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేస్తోంది. బడిబాటలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది.

- విజయకుమారి, మేడ్చల్‌ జిల్లా, డీఈఓ.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలో అయ్యప్ప స్వాములకు శనివారం అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాములు 45 రోజుల దీక్ష అనంతరం శబరిమలకు వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారని, వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పరిసర ప్రాంత అయ్యప్ప స్వాములు విచ్చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

మూసాపేట: భరత్‌నగర్‌ కాలనీలోని శ్రీసాయి అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం పూజలను మాజీ కార్పొరేటర్‌ శ్రావణ్‌కుమార్‌ ప్రారంభించారు. మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన (భిక్ష)లో పాల్గొన్నారు. డిసెంబర్‌ 29 వరకు ప్రతి రోజూ ఉదయం గణపతి హోమం, అభిషేకం, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం పడిపూజ, భజన, అల్పాహారం వంటి కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్వాములు నరేందర్‌, సత్తయ్య, రామకృష్ణ, రాధాకృష్ణ, వెంకటేష్‌, బాలు, సప్పిడి శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం పవిత్ర మకర మండల దీక్ష నెల ప్రారంభమైన సందర్భంగా మండల దీక్ష పూజలు అరుణ్‌గురు స్వామిచే ఘనంగా ప్రారంభించారు. అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ చైర్మన్‌ వడ్డేపల్లి రాజేశ్వరరావు గురు స్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ వేసుకున్నారు. అయ్యప్ప స్వాములందరికీ ఆలయంలో డిసెంబర్‌ 31 వరకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని, స్వాములకు, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.



అయ్యప్ప స్వాములకు అన్నదానాన్ని ప్రారంభిస్తున్న శ్రావణ్‌కుమార్‌



అరుణ్‌ గురుస్వామితో మాలధారుడు రాజేశ్వరరావు

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

- బీసీ కమిషన్‌ చైర్మన్‌ గోపిశెట్టి నిరంజన్‌



నిరంజన్‌ నివాసంలో వివరాల నమోదులో పాల్గొన్న అధికారులు

మోతీనగర్‌: రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే దేశానికే ఆదర్శమని, ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని బీసీ కమిషన్‌ చైర్మన్‌ గోపిశెట్టి నిరంజన్‌ అన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట డివిజన్‌ అవంతినగర్‌ కాలనీలో సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేలో భాగంగా గోపిశెట్టి నిరంజన్‌ కుటుంబ సభ్యుల వివరాలను మూసాపేట సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ వంశీ పైడిపల్లి బృందం సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే కోసం ఇంటికి వచ్చిన ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు సర్వేలో భాగస్వాములు కావాలన్నారు. సర్వేతో రాష్ట్రంలో ఏ సామాజిక వర్గం ఎంత మంది ఉన్నారో క్లుప్తంగా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌ కొండబత్తిని మురళి, టాక్స్‌ ఇన్‌స్పెక్టర్‌ అజముద్దీన్‌, నాయకులు గోపిశెట్టి రాఘవేందర్‌, రాకేష్‌, నరసింహ, మల్లప్ప, బాలరంగప్ప, బి.సత్యనారాయణ గౌడ్‌, ప్రతాప్‌, బాకారం, బిక్షపతి, బుచ్చన్న, వజ్రం తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ పరామర్శ

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ప్రమాదవశాత్తు వంట నూనె మీద పడి తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్న వ్యక్తిని కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌ శనివారం పరామర్శించారు. ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ హస్మత్‌పేట చౌరస్తాలో ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్‌ నిర్వహిస్తున్న అప్సర్‌పై ప్రమాదవశాత్తు శుక్రవారం రాత్రి వేడి నూనె పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. తక్షణమే చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్‌ ఏజాజ్‌, కర్రె జంగయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి



హెచ్‌పీ రోడ్డులో పర్యటిస్తున్న కార్పొరేటర్‌ సతీష్‌గౌడ్‌ తదితరులు

మూసాపేట: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఫతేనగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ పండాల సతీష్‌ గౌడ్‌ అన్నారు. శనివారం డివిజన్‌ పరిధిలోని హెచ్‌పీ రోడ్డులో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గాయత్రి మందిరం రోడ్డులో గత దశాబ్ద కాలం నుంచి భూగర్భ డ్రైనేజీ సమస్య ఉండటంతో ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో గత ఫిబ్రవరిలో డ్రైనేజీ వ్యవస్థను నిర్మించామన్నారు. డ్రైనేజీ పనులు పూర్తి అయిన తరువాత రోడ్డు నిర్మాణం పనులు ఆగిపోయాయని, నిధులు మంజూరు కాగానే నిర్మాణం చేపట్టాలని డీఈ శంకర్‌కు సూచించారు. వారం రోజుల్లో రోడ్డు పనులు ప్రారంభించి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్‌ ఏఈ రాధాకృష్ణ, తూము జగదీష్‌, శ్రీను, పటేల్‌, తూము శ్రీను, మల్లికార్జున్‌, ప్రీతమ్‌, బాబూరావు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డ్రగ్స్‌ కంట్రోల్‌ విభాగం సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసరావు

కూకట్‌పల్లి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్‌ కంట్రోల్‌ విభాగం సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాసరావు అన్నారు. కేపీహెచ్‌బీలోని ప్రగతి డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు మత్తు పదార్థాలు, వాటి దుష్పరిణామాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్‌ వాడకం వల్ల యువత నిర్వీర్యం అవుతుందన్నారు. విద్యార్థులే లక్ష్యంగా కొంత మంది మత్తు పదార్థాలను అనేక దొంగదారుల్లో స్కూల్‌, కాలేజీలకు సమీపంలో ఉన్న పాన్‌ షాపుల్లో వాటిని స్థావరాలుగా చేసుకొని అమ్ముతున్నట్లు తెలుస్తోందన్నారు. విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల గురించి పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ శ్రీధర్‌రావు, డైరెక్టర్‌ రవీందర్‌రావు, ఎన్‌సీసీ అధికారి మేజర్‌ రత్నాజీ, పోలీస్‌ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వైకల్‌ కేన్సర్‌ ఎలిమినేషన్‌ డే 4వ వార్షికోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న ఫార్మాసిస్టులు, నర్సులు, సిబ్బంది

కూకట్‌పల్లి: సర్వైకల్‌ కేన్సర్‌ ఎలిమినేషన్‌ డే నాలుగవ వార్షికోత్సవాన్ని శనివారం రాందేవ్‌ రావు హాస్పిటల్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్‌ ఛాయాదేవి, డాక్టర్‌ భవాని దివ్య, డాక్టర్‌ మంజుల, అర్చనా మోరే, డాక్టర్‌ ఎన్‌. యోబు సీఈవో ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఛాయాదేవి మాట్లాడుతూ.. గర్భాశయ ముఖ ద్వారం వద్ద వచ్చే కేన్సర్‌ని కేన్సర్‌ సర్విక్స్‌ అంటారని తెలిపారు. 80 శాతం కంటే ఎక్కువ హెచ్‌పీవీ ఇన్‌ఫెక్షన్‌ వల్ల కలుగుతాయన్నారు. సర్వైకల్‌ కేన్సర్‌ని దాని వల్ల వచ్చే పరిణామాల గురించి వివరించారు. దీనికి వ్యాక్సిన్‌ సులువైన మార్గం అని చెప్పారు. డాక్టర్‌ భవాని దివ్య మాట్లాడుతూ.. 0.5 ఎంఎల్‌ వ్యాక్సిన్‌ తీసుకోవడం వల్ల సర్వైకల్‌ కేన్సర్‌ను నివారించవచ్చునని వివరించారు. డాక్టర్‌ మంజుల కాల్‌పోస్కోపి టెస్టింగ్‌ గురించి, మామోగ్రామ్‌ గురించి వివరించారు. డాక్టర్‌ యోబు మాట్లాడుతూ.. రాందేవ్‌ రావ్‌ హాస్పిటల్‌ పెద్ద ఎత్తున సర్వైకల్‌ కేన్సర్‌ వ్యాక్సినేషన్‌ ప్రోగ్రాం నిర్వహిస్తుందని తెలిపారు. డిసెంబర్‌ 10వ తేదీన 250 మంది పిల్లలకు ఫ్రీ వ్యాక్సినేషన్‌ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

శబరిమలకు అయ్యప్ప స్వాములు

ఆల్విన్‌కాలనీ: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆస్‌బెస్టాస్‌ కాలనీలోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, గణపతి హోమం నిర్వహించారు. శనివారం ఉదయం 5 గంటలకు ఇరుముళ్లు కట్టుకొని అయ్యప్ప స్వాములు శబరిమలకు బయలుదేరారు. తెల్ల హరికృష్ణ గురుస్వామి 18వ మాల ధారణ, పడి సందర్భంగా కొబ్బరి మొక్కని ఆలయ ప్రాంగణంలో నాటారు.



కార్యకర్తలు అధికారులకు సహకరించాలి

- కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌



పార్టీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్‌

కూకట్‌పల్లి: కాంగ్రెస్‌ కార్యకర్తలు, నాయకులు సమగ్ర సర్వే అధికారులు, సిబ్బందికి సహకరించాలని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేపై శనివారం బాలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమం కావడంతో పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలను నాయకులకు, కార్యకర్తలకు వివరించారు. గడువులోగా అధికారులు సర్వే పూర్తి చేసేలా చూడాలన్నారు. అనంతరం కులగణన పై సర్వే నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడారు. సర్వే కోసం ఇంటింటికీ వెళ్లిన సమయంలో అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలపై, అక్కడ పడుతున్న సమయం, ప్రజల నుంచి అందుతున్న సహకారంపై ఆయన ఆరా తీశారు.